

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 35 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 05, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# నగర పోరుకు.. సన్నాహా జోరు !




• కాంగ్రెస్ జోష్‌లో మున్సిపల్ ఎన్నికల సిద్ధం • పంచాయతీ విజయం తర్వాత కాంగ్రెస్ దృష్టి • నగరాలపైజనవరి నోటిఫికేషన్... ఫిబ్రవరిలో పోలింగ్? • రేవంత్ ప్రతిష్టాత్మకంగా... కృష్ణా జలాలే అస్త్రం! • బీఆర్ఎస్ కసితో రంగంలో... బీజేపీ కూడా ప్రయత్నం • జీహెచ్ఎంసీ ఎన్నికలు ఆలస్యం... మూడు కార్పొరేషన్ల ప్రతిపాదన • గ్రేటర్ హైదరాబాద్ ప్రత్యేక స్థితి, వార్డుల పెంపు • ఇద్దరు పిల్లల నిబంధన రద్దు... ఎక్కువ అభ్యర్థులు రంగంలోకి.. • నగర అభివృద్ధే కీలకం... రాజకీయాలకు కొత్త దిశ! • జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ



హైదరాబాద్, (జై భీమ్ డెస్క్)

తెలంగాణలో గ్రామీణ రాజకీయాల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు నగరాలు, పట్టణాలపై దృష్టి పెట్టింది. పంచాయతీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించిన జోష్‌తో మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతోందని జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 117 మున్సిపాలిటీలు, కొన్ని మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి.తాజా సమాచారం ప్రకారం, ఈ నెల (జనవరి) 11 నుంచి 20 మధ్య నోటిఫికేషన్ విడుదల కానుంది. ఫిబ్రవరిలో పోలింగ్ జరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సన్నాహాలు పూర్తి చేస్తోంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ కూడా ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేసింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను




డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పంచాయతీల్లో లాగానే నగరాల్లోనూ కాంగ్రెస్ హవా కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా నది జలాలు, అభివృద్ధి పథకాలను క్యాంపెయిన్‌లో ప్రధాన అంశాలుగా మలచనున్నారు. రేవంత్ స్వయంగా జిల్లాల పర్యటనలు చేపట్టి, పార్టీ నేతలను రంగంలోకి దింపనున్నారు.ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం ఈ ఎన్నికల్లో తిరిగి బలం చూపాలని కసితో ఉంది. గతంలో మున్సిపల్ ఎన్నికల్లో ఆధిపత్యం చూపిన బీఆర్ఎస్, ప్రభుత్వ వైఫల్యాలను హైలైట్ చేస్తూ ప్రజలను ఆకర్షించాలని ప్లాన్ చేస్తోంది. బీజేపీ కూడా కొన్ని ప్రాంతాల్లో తన బలాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తోంది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) ఎన్నికలు మాత్రం వేరుగా ఉండవచ్చు. GHMC మూడు కార్పొరేషన్లుగా విభజించే ప్రతిపాదనలు చర్చలో ఉన్నాయి. ఇటీవల

- మిగతా 2లో..




## పోలీసు అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

సెర్చ్ వారెంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఎక్కడదని ప్రశ్నించిన హైకోర్టు

ఏ నిబంధనలు, ఏ జీవో ఆధారంగా చేస్తున్నారో వివరాలు సమర్పించాలన్న హైకోర్టు

తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా

వివరాలు 2లో

## దేవుడి మీద ఒట్టు...

### ఇదే నా కమిట్ మెంట్ : సీఎం రేవంత్ రెడ్డి

కేసీఆర్ మాటలతోనే చంద్రబాబు బనకచర్ల ప్రతిపాదన చేశారన్న సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ప్రయోజనాలకు భిన్నంగా తాను ఎప్పటికీ వ్యవహరించనని వెల్లడి

తనకు సొంత ప్రాంత ప్రయోజనాల తర్వాతనే పార్టీ అని పేర్కొన్న రేవంత్ రెడ్డి

2




## ఒలింపిక్స్ నిర్వహణ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాం : ప్రధాని మోదీ

2

వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్

క్రీడాకారులను ఉద్దేశించి వర్చువల్ గా ప్రసంగించిన ప్రధాని మోదీ

భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు





## పోలవరంపై ఏపీతో న్యాయపోరాటం...

సుప్రీంలో వాదనలకు తెలంగాణ సర్కారు సిద్ధం

పోలవరం విస్తరణపై ఏపీకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ

గోదావరి జలాల్లో తమ వాటా కోసం న్యాయపోరాటానికి సిద్ధం

ముంబైలో సీనియర్ న్యాయవాదితో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ భేటీ

అక్రమ విస్తరణ పనులు ఆపాలని పిటిషన్‌లో విజ్ఞప్తి

ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు నిలిపేయాలని కోరిన తెలంగాణ

వివరాలు 2లో

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# నగర పోరుకు సన్నాహ జోరు!

అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లులతో +ఎవీజ వార్డుల సంఖ్య 150 నుంచి 300కు పెరిగింది. GHMC ఎన్నికలు ఏప్రిల్-మే నెలల్లో జరగవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.మరో ముఖ్య మార్పు ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉన్నవారు పోటీ చేయకూడదనే నిబంధనను రద్దు చేస్తూ ఇటీవల అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందింది. ఇకపై ఎక్కువ మంది అభ్యర్థులు రంగంలోకి దిగే అవకాశం ఉంది.తెలంగాణ నగరాల అభివృద్ధి, స్థానిక సమస్యలు ఈ ఎన్నికల్లో కీలక అంశాలు కానున్నాయి. కాంగ్రెస్ గ్రామీణ హవాను నగరాలకు విస్తరిస్తుందా? లేక బీఆర్ఎస్ రికవరీ ఇస్తుందా? ఫలితాలు ఏమైనా, ఈ ఎన్నికలు తెలంగాణ రాజకీయాలకు కొత్త దిశను నిర్దేశించనున్నాయి!

మొదటి పేజీ తరువాయి

# షెట్పల్లి గ్రామాభివృద్ధికి యువతే శక్తి సర్పంచ్ గోపీకృష్ణ చొరవ



**చెన్నూరు, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

చెన్నూర్ నియోజకవర్గం, కోటపల్లి మండలం, షెట్పల్లి గ్రామపంచాయితీలో గ్రామాభివృద్ధి దిశగా కీలక ముందడుగులు పడుతున్నాయి. షెట్పల్లి గ్రామ సర్పంచ్ గోపీకృష్ణ గ్రామాభివృద్ధి లక్ష్యంగా గ్రామ యువకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి, వాటికి సమర్థవంతమైన పరిష్కారాలు ఎలా చూపించాలనే అంశంపై యువతకు అవగాహన కల్పించారు. గ్రామ సమస్యలు త్వరగా పరిష్కారమవ్వాలంటే యువత భాగస్వామ్యం అత్యంత అవసరమని సర్పంచ్ గోపీకృష్ణ స్పష్టంగా తెలిపారు. అనంతరం యువకులను వార్డు వారీగా విభజించి, ప్రతి వార్డులో చేయాల్సిన పనులను వారికి కేటాయించారు. ఈ విధంగా బాధ్యతలను పంచుకోవడం ద్వారా సమస్యలు వేగంగా, సులభంగా పరిష్కారమవుతాయని ఆయన వివరించారు. గ్రామాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, అందరూ సమన్వయంతో పనిచేస్తే షెట్పల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని సర్పంచ్ గోపీకృష్ణ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# పోలవరంపై ఏపీతో న్యాయపోరాటం...

**సుప్రీంలో వాదనలకు తెలంగాణ సర్కారు సిద్ధం**
**పోలవరం విస్తరణపై ఏపీకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ**
**గోదావరి జలాల్లో తమ వాటా కోసం న్యాయపోరాటానికి సిద్ధం**
**ముంబైలో సీనియర్ న్యాయవాదితో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ భేటీ**
**అక్రమ విస్తరణ పనులు ఆపాలని పిటిషన్‌లో విజ్ఞప్తి**
**ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు నిలిపేయాలని కోరిన తెలంగాణ**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

గోదావరి నదీ జలాల్లో తమకు దక్కాల్సిన వాటా విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. పోలవరం ప్రాజెక్టు విస్తరణ పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులను తాము అంగీకరించలేది లేదంటూ, సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం ముంబైలో సీనియర్ న్యాయ నిపుణులతో సమావేశమయ్యారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టును వ్యతిరేకించేందుకు న్యాయపరమైన చర్యలను తెలంగాణ ప్రభుత్వం ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్.. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వితో భేటీ అయ్యారు. కోర్టులో రాష్ట్రం తరఫున సమర్థవంతమైన, బలమైన వాదనలు వినిపించాలని వారు న్యాయ నిపుణులను కోరారు. అవసరమైన అన్ని పత్రాలు, ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను సీఎం కార్యాలయం అప్రమత్తం చేసింది.తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. చట్టబద్ధమైన అనుమతులు లేకుండా పోలవరం ప్రాజెక్టును బనకచర్ల లేదా నల్లమల సాగర్‌తో అనుసంధానించే విస్తరణ పనులను ఏపీ ప్రభుత్వం చేపడుతోందని పిటిషన్‌లో ఆరోపించింది. ఈ పనులను తక్షణమే ఆపాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని కోరింది. ఆమోదించిన అసలు డిజైన్ ప్రకారమే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరగాలని స్పష్టం చేసింది.తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నల్లమల సాగర్ ప్రాజెక్టు నివేదికలను పరిశీలించడాన్ని కూడా పిటిషన్‌లో తప్పుబట్టింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘించి ఏపీ ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేస్తోందని, ఈ విస్తరణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు, ఆర్థిక సహాయం నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ పిటిషన్ త్వరలో సుప్రీంకోర్టులో విచారణకు రానుంది.

# ఫిట్నెస్‌కు క్రమశిక్షణే పునాది





**ఘనంగా సైజెన్ జిమ్ చైర్మన్ పస్తాం లడ్డు శివరామ్ జన్మదినోత్సవం**

**హైద్రాబాద్, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

నూతన సంవత్సర వేడుకల మధ్య, సైజెన్ జిమ్ చైర్మన్ పస్తాం లడ్డు శివరామ్ జన్మదినోత్సవాన్ని ఆత్మీయ మిత్రులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామ్ తో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో, ఉత్సాహంగా సాగింది. ఫిట్నెస్ రంగంలో క్రమశిక్షణ, పట్టుదల, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన వ్యక్తిగా శివరామ్ ప్రత్యేక గుర్తింపు పొందారని పలువురు కొనియాడారు. మిత్రులకు ఎల్లప్పుడూ అండగా నిలవడం, అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే స్వభావం కారణంగా ఆయనకు శివ బ్రదర్ / శివన్న అనే పేరుతో విశేషమైన అభిమాన వర్గం ఏర్పడిందని తెలిపారు. అందుకే ఆయన పుట్టినరోజు వేడుకలు ప్రతి ఏడాది కుటుంబ వాతావరణంలో ప్రత్యేకంగా జరుపుకుంటారని మిత్రులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన డాక్టర్ బరిగెల శివ జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్ విస్తృతంగా మాట్లాడుతూ, "శివరామ్ ఫిట్నెస్‌ను కేవలం శారీరక ఆరోగ్యానికి మాత్రమే పరిమితం చేయకుండా, క్రమశిక్షణతో కూడిన జీవన విధానంగా యువతకు అలవాటు చేస్తున్నారు. నేటి యువత మాదక ద్రవ్యాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలంటే జిమ్, క్రీడలు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన మార్గాలు అవసరం. ఆ దిశగా సైజెన్ జిమ్ చేస్తున్న సేవలు నిజంగా అభినందనీయం" అని ప్రశంసించారు. అదేవిధంగా, "సమాజంలో ఆరోగ్యకరమైన మార్పు రావాలంటే శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం కూడా అవసరం. శివరామ్ యువతను ఆ దిశగా ప్రోత్సహిస్తూ, అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. భవిష్యత్తులో ఫిట్నెస్ రంగంలో మరింత విస్తృత సేవలు అందించి, యువతను మంచి మార్గంలో నడిపించాలని నేను ఆకాంక్షిస్తున్నాను" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, సాయి, నాగరాజు, తరుణ్, ఐజయ్ తదితరులు పాల్గొని శివరామ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చివరగా శివరామ్ ఆరోగ్యంగా, దీర్ఘాయుష్షుతో ఉండి, ఫిట్నెస్ రంగంలో మరెన్నో విజయాలు సాధిస్తూ, సమాజానికి మరింత సేవ చేయాలని అందరూ హృదయపూర్వకంగా ఆకాంక్షించారు.

# దేవుడి మీద ఒట్టు... ఇదే నా కమిట్ మెంట్ : సీఎం రేవంత్ రెడ్డి

**కేసీఆర్ మాటలతోనే చంద్రబాబు బనకచర్ల ప్రతిపాదన చేశారన్న సీఎం రేవంత్ రెడ్డి**

**తెలంగాణ ప్రయోజనాలకు భిన్నంగా తాను ఎప్పటికీ వ్యవహరించనని వెల్లడి**

**తనకు సొంత ప్రాంత ప్రయోజనాల తర్వాతనే పార్టీ అని పేర్కొన్న రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

గోదావరిబనకచర్ల ప్రాజెక్టు అంశంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభ వేదికగా ఘాటుగా సమాధాన మిచ్చారు. తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా తాను ఎప్పటికీ వ్యవహరించనని స్పష్టం చేస్తూ, గత పాలకుల నిర్ణయాలే నేటి వివాదాలకు కారణమని వివరించారు. నీళ్లు నిజాలు అనే అంశంపై శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్ రెడ్డి గోదావరి జలాలు, బనకచర్ల ప్రాజెక్టు, కృష్ణా జలాల పంపకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలంటూ 2016లోనే జల్‌శక్తిశాఖ సమావేశంలో అప్పటి సీఎం కేసీఆర్ మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ చెప్పిన మాటలతోనే చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు ఆలోచన చేశారని పేర్కొన్నారు. కేంద్ర జల్‌శక్తిశాఖ నిర్వహించిన సమావేశాలకు కేసీఆర్ రెండు సార్లు హాజరయ్యారని గుర్తుచేశారు. కృష్ణా జలాల పంపకాల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు కేసీఆర్ అంగీకరించి, ట్రైబ్యునల్ తుది తీర్పు వచ్చే వరకూ అదే కొనసాగిస్తామని సంతకం చేశారన్నారు. 2020లో వాటా పెంచుకునే అవకాశం వచ్చినా అప్పటి ప్రభుత్వం ఉపయోగించుకోలేదని విమర్శించారు. నాకు నా ప్రాంతమే ముఖ్యం. ఆ తర్వాతనే పార్టీ. అందుకే అప్పట్లో బయటకు వచ్చా. సీఎం కుర్చీలో కూర్చొని తెలంగాణకు అన్యాయం జరిగేలా నేను ఎప్పుడూ ప్రవర్తించను" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఆపించిన చరిత్ర తమదేనని తెలిపారు. ఆ పనులు నిలిపివేస్తేనే చర్చలకు వస్తామని స్పష్టమైన షరతు పెట్టామని చెప్పారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ నిజంగా ఆగిందో లేదో నిజనిర్ధారణ కమిటీ ద్వారా విచారణ చేయించుకోవచ్చని సవాల్ విసిరారు. "చచ్చినా.. బతికినా.. తెలంగాణ కోసమే. ఇదే నా కమిట్‌మెంట్. దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నా.. తెలంగాణకు అన్యాయం జరగనివ్వను" అని సభలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా ప్రకటించారు.

# సంక్రాంతి ప్రయాణం..

**ప్రైవేటు బస్సుల్లో ఛార్జీల బాదుడు!**
**హైదరాబాద్ నుంచి విజయవాడకు టికెట్ ధర గరిష్టంగా రూ. 4,000 వరకు పెంపు**
**బస్సులో సీటు ఉన్న పొజిషన్‌ను బట్టి ధరలు నిర్ణయిస్తున్న ట్రావెల్స్ సంస్థలు**
**పండగ రద్దీ నేపథ్యంలో తనిఖీలు లేకుంటే ప్రమాదాల ముప్పు తప్పదంటున్న ప్రయాణికులు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మొదలుకాకముందే ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు టికెట్ ధరలతో ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. పండగ కోసం సొంతూళ్లకు వెళ్లే వారి అవసరాలను ఆసరాగా చేసుకుని అడ్డగోలుగా ఛార్జీలు పెంచేస్తున్నాయి. రవాణా శాఖ నిబంధనలను బేఖాతరు చేస్తూ అప్పుడే 'పండగ దందా'కు తెరలేపాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు రూ. 700 గా ఉండే బస్సు ఛార్జీని.. పండగ వేళ రూ. 2,700 నుంచి రూ. 4,000 వరకు పెంచేశారు. రైళ్లలో రిజర్వేషన్లు దొరకకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీన్ని సొమ్ము చేసుకుంటున్న ట్రావెల్స్ యాజమాన్యాలు సీటు ఉన్న స్థానాన్ని బట్టి (ముందు, మధ్య, వెనుక) వేర్వేరు ధరలు వసూలు చేస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. కేవలం ఆదాయమే లక్ష్యంగా ప్రైవేటు బస్సులు ఇష్టానుసారంగా రోడ్లపైకి వస్తున్నాయి. ఇటీవల వరుస ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, డ్రైవర్ల అనుభవం, బస్సుల ఫిట్‌నెస్‌పై తనిఖీలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రమాదాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ముందస్తుగా రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి కఠినంగా వ్యవహరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# పోలీసు అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**సెర్చ్ వారెంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఎక్కడదని ప్రశ్నించిన హైకోర్టు**
**ఏ నిబంధనలు, ఏ జీవో ఆధారంగా చేస్తున్నారో వివరాలు సమర్పించాలన్న హైకోర్టు**
**తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో పోలీసుల చర్యలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పోలీస్ అసిస్టెంట్ కమిషనర్, కమిషనర్ స్థాయి అధికారులు తమంతట తాముగా సెర్చ్ వారంట్లు జారీ చేస్తుండటాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మోహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. సెర్చ్ వారంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఎక్కడిదని హైకోర్టు ఈ సందర్భంగా ప్రశ్నించింది. పిటిషనర్ విజయగోపాల్ వ్యక్తిగత హోదాలో వాదనలు వినిపిస్తూ.. సీఆర్పీసీ సెక్షన్ 93, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 47లను పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు మాత్రమే ఉన్న అధికారాలను వినియోగిస్తూ కార్డన్ అండ్ సెర్చ్ పేరుతో తనిఖీలు చేపడుతున్నారని తెలిపారు. నేరస్థులు, అక్రమ వలసదారుల కోసం అంటూ సెర్చ్ వారంట్ లేకుండానే ఇళ్లలోకి ప్రవేశించి గుర్తింపు పత్రాలు అడుగుతున్నారని ఆరోపించారు. వాదనలు విన్న ధర్మాసనం, సీఆర్పీసీ లేదా బీఎన్ఎస్‌లోని ఏ నిబంధనలు, జీవోల ఆధారంగా పోలీసులు సెర్చ్ వారంట్లు జారీ చేస్తున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రజాభద్రత నిమిత్తం పోలీసులు చేస్తున్న కృషిని అభినందించాల్సిందేనని వ్యాఖ్యానిస్తూ.. సెర్చ్ వారంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఉందా లేదా అన్న అంశంపై ఆధారాలతో సహా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# ఒలింపిక్స్ నిర్వహణ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాం : ప్రధాని మోదీ

**వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్**
**క్రీడాకారులను ఉద్దేశించి వర్చువల్ గా ప్రసంగించిన ప్రధాని మోదీ**
**భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు**

**ఢిల్లీ, జై భీమ్ న్యూస్**

భారతదేశం క్రీడా రంగంలో సరికొత్త శిఖరాలను అధిరోహించే దిశగా అడుగులు వేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఆయన.. క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే లక్ష్యంగా భారత్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ హక్కులను దక్కించుకోవడానికి ఎక్కడా రాజీపడకుండా కృషి చేస్తున్నామన్నారు. అలాగే, 2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో భారత్ తన సత్తాను చాటుతోందని, గత దశాబ్ద కాలంలో అండర్-17 ఫిఫా వరల్డ్ కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్లతో సహా 20కి పైగా అంతర్జాతీయ ఈవెంట్లను మన దేశం విజయవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు. వాలీబాల్ క్రీడ గొప్పతనాన్ని వివరిస్తూ.. ఇది కేవలం ఆట మాత్రమే కాదని, సహకారం, సమతుల్యత (బ్యాలెన్స్)తో కూడిన ప్రక్రియ అని మోదీ అభివర్ణించారు. బంతిని కింద పడకుండా గాలిలోనే ఉంచేందుకు చేసే ప్రయత్నంలో క్రీడాకారుల పట్టుదల కనిపిస్తుందన్నారు. 'టీమ్ ఫస్ట్' అనే నినాదంతో ప్రతి క్రీడాకారుడు జట్టు విజయం కోసమే ఆడాలని సూచించారు. వ్యక్తిగత నైపుణ్యాలు వేరైనా, సమష్టి కృషితోనే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ 72వ జాతీయ వాలీబాల్ టోర్నీలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, సంస్థల నుంచి 58 జట్లు పాల్గొంటున్నాయి. సుమారు 1,000 మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ టోర్నీ ద్వారా భారతీయ వాలీబాల్‌లో ఉన్న అత్యుత్తమ ప్రమాణాలు, క్రీడాస్ఫూర్తి వెలుగులోకి వస్తాయని నిర్వాహకులు ఆశిస్తున్నారు.

# శివనగర్ మీసేవ కేంద్రంలోకి ఖిలావరంగల్ ఎమ్మార్వో కార్యాలయం

### సోమవారం నుంచి పూర్తి స్థాయి సేవలు

**వరంగల్, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ ఫోర్ట్ రోడ్డులో ఇప్పటివరకు కొనసాగుతున్న ఖిలావరంగల్ మండల రెవెన్యూ కార్యాలయాన్ని (ఎమ్మార్వో కార్యాలయం) శివనగర్‌లోని మున్సిపల్ మీసేవ కేంద్రం పై అంతస్తుకు తరలిస్తున్నట్లు ఖిలావరంగల్ తహశీల్దార్ ఎండీ ఇక్బాల్ తెలిపారు. ఈ మేరకు కార్యాలయం మార్పునకు సంబంధించిన ఏర్పాట్లను తహశీల్దార్ స్వయంగా పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ మార్పు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త కార్యాలయ భవనంలో అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యాలయం నుంచి సోమవారం నుంచి పూర్తి స్థాయి రెవెన్యూ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. భూ సంబంధిత సమస్యలు, పట్టాదారు పాస్‌బుక్కులు, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఇతర రెవెన్యూ సేవలను ప్రజలు ఇకపై శివనగర్ మీసేవ కేంద్రం పై అంతస్తులోనే పొందవచ్చని స్పష్టం చేశారు. ఖిలావరంగల్ మండల ప్రజలు, రైతులు ఈ కార్యాలయ మార్పును గమనించి, కొత్త కేంద్రాన్ని వినియోగించుకోవాలని, కార్యాలయం మార్పు ప్రక్రియకు సహకరించాలని తహశీల్దార్ ఎండీ ఇక్బాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మార్పుతో ప్రజలకు సమయంతో కూడిన, సులభమైన సేవలు అందనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# సింగరేణి భవిష్యత్తుతో చెలగాటం






### కాంగ్రెస్ ప్రభుత్వానికి కార్మికులే బుద్ధి చెప్పాలి : గండ్ర వెంకట రమణా రెడ్డి

**భూపాలపల్లి, 04 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డు ఎండీ క్వార్టర్స్‌లో పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్ పర్సన్, భూపాలపల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వీధి రౌడీలా మాట్లాడుతున్నారని, ప్రతిపక్షం అంటేనే కాకుండా ప్రజలపైనా అసహ్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి యాజమాన్యం ప్రస్తుతం అత్యంత దౌర్భాగ్య పరిస్థితుల్లో సంస్థను నడుపుతుండటం ఆందోళనకరమన్నారు. మరింత బాధాకరమైన విషయం ఏమిటంటే, ఈ పరిస్థితులను ప్రశ్నించాల్సిన కార్మిక సంఘాలు కూడా పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తెలంగాణ ప్రజలకు గర్వకారణమైన సంస్థ అని గుర్తు చేసిన ఆయన, దసరా, రంజాన్ వంటి పండుగలను ప్రజలు ఆనందంగా జరుపుకునే విధంగా కార్మికులు జరుపుకునే సింగరేణి డేను కూడా పండుగ వాతావరణంలో నిర్వహించలేని స్థితికి ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దీనికి పూర్తిగా ప్రభుత్వ విధానాలు, యాజమాన్య వైఖరే కారణమని స్పష్టం చేశారు. సింగరేణికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, అదే సమయంలో ఫుట్‌బాల్ వంటి క్రీడా కార్యక్రమాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సింగరేణి సొమ్ము ఎందుకు వాడుతున్నారని, ప్రభుత్వం దివాలా తీసిందా అని నిలదీశారు. అనేక మంది పారిశ్రామికవేత్తలపై ఒత్తిడి తెచ్చి, భయపెట్టి సుమారు రూ.100 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన పరిస్థితులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో మెడికల్ అన్‌ఫిట్ ద్వారా సుమారు 15 వేల కుటుంబాల యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్దేనని తెలిపారు. అలాగే లాభాల వాటాలో కార్మికులకు 16 శాతం కాకుండా 32 శాతం ఇచ్చిన చరిత్ర కూడా కేసీఆర్ పాలనలోనే సాధ్యమైందన్నారు. భూపాలపల్లి సింగరేణి కార్మికుల కోసం 1000 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరుకు తానే కేసీఆర్‌ను ఒప్పించి సాధించానని గుర్తు చేశారు. అయితే ఇప్పటికీ మూడు సార్లు అన్‌ఫిట్ అయిన కార్మికులను కూడా ఫిట్‌గా ప్రకటించి వారి జీవితాలతో ఆటలాడుతున్నది ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వమని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో రాజకీయ మార్పు ఎప్పుడూ సింగరేణి కార్మికుల నుంచే మొదలైందని, అదే విధంగా రాబోయే రోజుల్లో కూడా మార్పు ఇక్కడి నుంచే ప్రారంభమవ్వాలని అన్నారు. మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం పూర్తై ఏడాది గడిచినా ఎన్నికలు నిర్వహించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆక్షేపించారు. అవసరం వచ్చినప్పుడే ఎన్నికలు పెట్టడం ప్రభుత్వానికి తగదన్నారు. గతంలో ధర్నాలు, రాస్తారోకోలతో నిరసనలు వ్యక్తం చేసేవారని, కానీ నేటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి నిజమైన గుణపాఠం చెప్పేది ఓటు ద్వారానేనని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో అధికార పక్షానికి చెంపపెట్టు లాంటి తీర్పు రావాల్సిన అవసరం ఉందని, అందుకు బలమైన ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితికు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లలో భూపాలపల్లి పట్టణం సాధించిన అభివృద్ధి, గోదావరి జలాలతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, జిల్లాల పునర్వ్యవస్థీకరణతో గ్రామపంచాయతీ స్థాయి నుంచి జిల్లా కేంద్రంగా ఎదగడం, మారుమూల ప్రాంతంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేసీఆర్ నాయకత్వంలోనే జరిగాయని ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మికులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల పెన్షనర్స్ డే డైరీ ఆవిష్కరణ వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**హన్మకొండ, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్షనర్స్ డే, డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి గారితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, రిటైర్డ్ కళాశాల అధ్యాపకులు విద్యారంగానికి అందించిన సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. వారి కృషి వల్లే అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా అధ్యాపకుల అనుభవం, జ్ఞానం సమాజానికి ఎంతో మార్గదర్శకమని ఆమె అన్నారు. అనంతరం డైరీని ఆవిష్కరించిన ఎంపీ, సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల సంఘ భవన అభివృద్ధికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తానని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం లీజుపై ఉన్న భవనాన్ని మరో 30 సంవత్సరాల పాటు లీజు పొడిగించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలని




సూచించిన ఎంపీ, పదవీ విరమణ చేసిన అధ్యాపకులు తమ అనుభవాలు, జ్ఞానాన్ని సమాజహితానికి వినియోగించుకుంటూ కొనసాగించాలని కోరారు. వచ్చే పెన్షనర్స్ డే కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావాలని ఆహ్వానిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు పరస్పర ఆత్మీయతను, ఐక్యతను పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రెసిడెంట్ పులిసారంగాపాని, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సెక్రటరీ మల్లారెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ రాజయ్య, జాయింట్ సెక్రెటరీలు కృష్ణమూర్తి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లకు వైద్య పరీక్షలు, అవగాహనతో రోడ్డు భద్రతకు బాట

### ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు అవసరం జి. వేణుగోపాల్ జిల్లా రవాణా అధికారి, డా. రామ్ కృష్ణ భార్గవ్ మెడికల్ ఆఫీసర్






**హన్మకొండ, 04 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

రోడ్డు ప్రమాదాలను తగ్గించడంతో పాటు వాహనదారుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా హనుమకొండ జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. హనుమకొండ జిల్లా వైద్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. అప్పయ్య ఆదేశాల మేరకు, హనుమకొండ జిల్లా డీటీఓ కార్యాలయ ప్రాంగణంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో స్థానికంగా పనిచేస్తున్న ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య స్థితిగతులపై అవగాహన కల్పించారు. వాహనదారుల ఆరోగ్య సమస్యలు రోడ్డు ప్రమాదాలకు దారితీయకుండా ఉండాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెడికల్ ఆఫీసర్ డా. రామ్ కృష్ణ భార్గవ్ డ్రైవర్లకు కంటి పరీక్షలు, రక్తపోటు (బీపీ) పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి తగిన వైద్య సలహాలు, సూచనలు అందించడంతో పాటు అవసరమైన మందులను కూడా పంపిణీ చేశారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రాణాంతక ప్రమాదాలు, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా పాటించాల్సిన రోడ్డు భద్రతా నియమాలు, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ ప్రాముఖ్యతపై డ్రైవర్లకు విస్తృతంగా అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా జి. వేణుగోపాల్, జిల్లా రవాణా అధికారి (డీటీఓ) మాట్లాడుతూ, డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో అవసరమని, ఆరోగ్యంగా ఉన్న డ్రైవర్ల ద్వారానే రోడ్డు భద్రత సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమన్ వి. కిశోర్ బాబు (ఎం.వి.ఐ), కీర్తివర్ధన్ (ఏఎం.వి.ఐ), బండ్ల శ్రావణ్ (ఏఎం.వి.ఐ)తో పాటు సూపర్‌వైజర్లు, నర్సింగ్ ఆఫీసర్లు లలిత, కల్పన, సువర్ణ, ల్యాబ్ టెక్నీషియన్లు సందీప్, జి. నగేష్, ఎం.డి. మొక్సిల్విన్, ప్రసాద్ తదితరులు పాల్గొని శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరం ద్వారా సుమారు 106 మంది డ్రైవర్లు మరియు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, డ్రైవర్లు ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గడంతో పాటు డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు.

# సైదాపూర్ పోలీస్ స్టేషన్‌కు తొలి మహిళా ఎస్ఐగా కొప్పుల స్వాతి

### శాంతి, భద్రతల పరిరక్షణలో కొత్త అధ్యాయం



**సైదాపూర్, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

సైదాపూర్ మండల కేంద్రానికి నూతనంగా బదిలీపై వచ్చిన మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ కొప్పుల స్వాతిని సైదాపూర్ 3వ వార్డు సభ్యులు బండారి భరత్, మాజీ వార్డు సభ్యులు బోనగిరి అనిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సైదాపూర్ పోలీస్ స్టేషన్ చరిత్రలో తొలి మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కొప్పుల స్వాతి బాధ్యతలు చేపట్టడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. మహిళా అధికారిణిగా పోలీస్ స్టేషన్ బాధ్యతలు స్వీకరించడం సైదాపూర్ మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఇది మహిళలకు స్ఫూర్తినిచ్చే పరిణామమని తెలిపారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కొప్పుల స్వాతి కృషితో సైదాపూర్ మండలం శాంతి, భద్రతలతో ప్రశాంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావాలని, సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో పని చేయాలని కోరారు. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వారు అభిప్రాయపడ్డారు. అలాగే జిల్లా, రాష్ట్ర స్థాయిలో సైతం సైదాపూర్ పోలీస్ స్టేషన్ ఒక ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా గుర్తింపు పొందాలని, ప్రజల నమ్మకాన్ని పొందే విధంగా పని చేయాలని ఆకాంక్షించారు. పోలీస్‌ప్రజల మధ్య సమన్వయం మరింత బలపడితే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కొప్పుల స్వాతి మాట్లాడుతూ, సైదాపూర్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని, ప్రజల సహకారంతో నేరరహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో చట్టసువ్యవస్థను కట్టుదిట్టంగా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# డాక్టర్ లూయిస్ బ్రేలీ 217వ జయంతి వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్, జిల్లా కలెక్టర్

**హన్మకొండ, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

డాక్టర్ లూయిస్ బ్రేలీ 217వ జయంతిని పురస్కరించుకుని 23వ డివిజన్ పరిధిలోని లూయిస్ అంధుల పాఠశాలలో నిర్వహించిన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి నగర మేయర్ గుండు సూధారాణి, జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాచ్పాయ్లతో కలిసి 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు డాక్టర్ లూయిస్ బ్రేలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దృష్టిలోపం ఉన్నవారి విద్యా వికాసానికి బ్రేలీ లిపి చేసిన సేవలు అమూల్యమైనవని వారు కొనియాడారు. బ్రేలీ లిపి ద్వారా అంధులకు విద్య, జ్ఞానం, ఆత్మవిశ్వాసం లభించిందని పేర్కొన్నారు. నగర మేయర్ గుండు సూధారాణి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమానికి నగర పాలక సంస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. అంధుల పాఠశాలల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం తరఫున అన్ని రకాల సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ చాహత్ బాచ్పాయ్ దివ్యాంగుల విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల పాత్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## కేఆర్ దిలీప్ రాజ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జట్టి యుగేందర్

**వరంగల్, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**




“అన్నా అంటే నేను ఉన్నాను” అనే భావనతో నిత్యం యువతకు భరోసా కల్పిస్తూ, యువత ఆశయాలకు దిశ చూపుతూ ముందుకు దూసుకెళ్తున్న నవయువ నాయకుడు, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ కి జట్టి యుగేందర్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జట్టి యుగేందర్ మాట్లాడుతూ, దిలీప్ రాజ్ యువత సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సమర్థవంతమైన యువ నాయకుడని ప్రశంసించారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం వంటి కీలక అంశాలపై యువతను చైతన్యపరుస్తూ, ప్రజాసేవనే లక్ష్యంగా రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలో యూత్ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో దిలీప్ రాజ్ పాత్ర కీలకమని, యువతను సంఘటితం చేసి ఉద్యమాల వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను యువతలోకి తీసుకెళ్లడమే కాకుండా, ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. యువత శక్తిని సంఘటితం చేస్తూ ప్రజాసేవే లక్ష్యంగా మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామని, మీ నాయకత్వంలో యువతకు మరింత ప్రేరణ, సమాజానికి మరింత సేవ కలగాలని జట్టి యుగేందర్ ఆకాంక్షించారు. దిలీప్ రాజు జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను మరింత చురుకుగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

## హనుమకొండ నక్కలగుట్టలో ఆర్‌సీటీఏ డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని







**హన్మకొండ, జనవరి 4, 2026 (జై భీమ్ న్యూస్) :**

హనుమకొండ నక్కలగుట్టలోని రిటైర్డ్ కాలేజ్ టీచర్ అసోసియేషన్ (ఆర్‌సీటీఏ) కార్యాలయంలో నిర్వహించిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో అధ్యాపకుల సేవలు మరువలేనివని అన్నారు. పదవీ విరమణ చేసినా విద్యావేత్తల అనుభవం, విజ్ఞానం సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువతను సరైన దిశలో నడిపించడంలో అధ్యాపకుల పాత్ర ఎప్పటికీ కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. రిటైర్డ్ కాలేజ్ టీచర్ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, అసోసియేషన్ భవన నిర్మాణానికి తన నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్) నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని ప్రకటించారు. ఈ ప్రకటనకు అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తమ ఆహ్వానాన్ని మన్నించి కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ఆర్‌సీటీఏ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీటీఏ అధ్యక్షులు, సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మోహన్ గౌడ్, శివ శంకర్ రెడ్డి

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

హన్మకొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కేఆర్ దిలీప్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా వరంగల్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్, నర్సింహులగూడెం సర్పంచ్ పోలేపల్లి శివ శంకర్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



## విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

### పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి






**హన్మకొండ, 4 జనవరి 2026(జై భీమ్ న్యూస్) :**

కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన పీడీఎస్‌యూ కేయూ 12వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ మహాసభకు పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షులు బి. బాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాంపాటి పృథ్వి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని సమీక్షించి అభివృద్ధి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. పాలకులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ విధానాలు రూపొందించడం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య దూరమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూల్ స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు ప్రభుత్వ విద్యారంగం అనేక సమస్యలతో సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం ద్వారా దళిత, గిరిజన, బడుగు వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. విద్యారంగానికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం విద్యార్థులంతా సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ పూర్వ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతూ, సమాజ మార్పు కోసం జరిగే పోరాటాల్లో విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజాస్వామ్య, లౌకిక, మానవీయ విలువలను పెంపొందించుకుంటూ శాస్త్రీయ దృక్పథంతో సమాజాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అసమాన త్యాగాలు చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ల పోరాట స్ఫూర్తిని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభానికి ముందు పీడీఎస్‌యూ బిగిపిడికిలి జెండాను కేయూ అధ్యక్షులు బి. బాలకృష్ణ ఆవిష్కరించారు. విద్యార్థి అమరవీరులను స్మరిస్తూ కేయూ ప్రధాన కార్యదర్శి వి. కావ్య సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా మహాసభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, రాష్ట్ర నాయకులు బి. అజయ్, పి. అనూష, కేయూ ఉపాధ్యక్షులు గణేష్, వంశీ, సహాయ కార్యదర్శులు లోకేష్, కోశాధికారి సంగీత తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం 17 మందితో కూడిన పీడీఎస్‌యూ కాకతీయ యూనివర్సిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేయగా, మహాసభ పలు కీలక తీర్మానాలను ఆమోదించింది.



## అతి భారీ వర్షాలకు తెగిన రాజులకొత్తపల్లి కట్ట పనులు ప్రారంభం



**రాజులకొత్తపల్లి, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

గత రెండు సంవత్సరాల క్రితం కురిసిన అతి భారీ వర్షాల కారణంగా తెగిపోయిన రాజులకొత్తపల్లి గ్రామ కట్ట మరమ్మతుల పనులు శనివారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ పనులకు ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ కొండ జనార్దన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, కట్ట నిర్మాణానికి బాధ్యత వహిస్తున్న కాంట్రాక్టర్ సుమలతతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. తెగిపోయిన కట్ట కారణంగా గత కొంతకాలంగా రైతులు సాగునీటి సమస్యలను ఎదుర్కొంటుండగా, ఇప్పుడు మరమ్మతుల పనులు ప్రారంభం కావడంతో గ్రామంలో ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, కట్ట పునర్నిర్మాణ పనులు పూర్తయితే గ్రామంలోని వ్యవసాయ భూములకు సాగునీటి సమస్యలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. రైతులకు ఇది ఎంతో ప్రయోజనకరమని, వ్యవసాయ ఉత్పత్తి పెరగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి నష్టాలు తలెత్తకుండా నాణ్యమైన పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆయన కోరారు. గ్రామస్థులు మాట్లాడుతూ, నూతన సర్పంచ్ చొరవతో ఎన్నాళ్లుగా ఎదురుచూస్తున్న కట్ట మరమ్మతుల పనులు ప్రారంభమైనందుకు హర్షం వ్యక్తం చేశారు. పనులను వేగంగా పూర్తి చేసి గ్రామానికి శాశ్వత ప్రయోజనం చేకూర్చాలని వారు కోరారు.

## ములుగు జిల్లా కేంద్రంలో హమాలీ కమ్యూనిటీ నూతన భవనం ప్రారంభం

### మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా ప్రారంభోత్సవం



**ములుగు జిల్లా, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్) :**

ములుగు జిల్లా కేంద్రంలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సుమారు రూ.11 లక్షల వ్యయంతో నిర్మించిన హమాలీ కమ్యూనిటీ నూతన భవనాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ములుగు జిల్లా కేంద్రంలో హమాలీ సోదరులు ఉదయం నుంచే కష్టపడి పనిచేసి, మధ్యాహ్నం భోజన సమయంలో చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో కూర్చుని సేదతీరాల్సిన పరిస్థితి తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ వర్గానికి ఒక సౌకర్యవంతమైన భవనం అవసరమని భావించి, వారి విశ్రాంతి, భోజన అవసరాలకు ఉపయోగపడేలా హమాలీ కమ్యూనిటీ భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. హమాలీ కార్మికులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్న మంత్రి, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో కూడా హమాలీ సోదరులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీ రాజ్ రాష్ట్ర డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ములుగు హమాలీ సంఘం అధ్యక్షుడు రాజు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. హమాలీ సంఘ సభ్యులు నూతన భవనం ప్రారంభమైనందుకు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ భవనం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు.

# అంబేద్కర్ చిత్రపట దహన ఘటనను ఖండిస్తూ హనుమకొండలో వీసీకే ఆందోళన



**హన్మకొండ, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని తగలబెట్టిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, హనుమకొండ జిల్లా కేంద్రంలో విముక్త చిరుతల పార్టీ (వీసీకే) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వీసీకే విద్యార్థి విభాగం, యూత్ విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ నాయకత్వంలో హనుమకొండ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. గ్వాలియర్ (మధ్యప్రదేశ్)లో జరిగిన ఈ ఘటనలో అంబేద్కర్ చిత్రపటాన్ని తగలబెట్టిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, నిరసనలో భాగంగా సంబంధిత వ్యక్తి ఫోటోను ప్రతీకాత్మకంగా అగ్నితో దహనం చేసి నిరసన తెలిపారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా ఆందోళనకు దారితీసిందని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీసీకే రాష్ట్ర అధ్యక్షులు డా. జిలుకర శ్రీనివాస్ (అడ్వకేట్) ఒక ప్రకటన విడుదల చేస్తూ, అంబేద్కర్‌ను ద్వేషించే కులవాద దృక్పథాలే ఇలాంటి చర్యలకు కారణమని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో పెరుగుతున్న ఆత్మగౌరవ చైతన్యాన్ని కొందరు సహించలేకపోతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన శిక్ష విధించాలని, రాజ్యాంగ విలువలను కాపాడాలని డిమాండ్ చేశారు. నిరసన సభలో అంబాల అనిల్ కుమార్ మాట్లాడుతూ, అంబేద్కర్ చిత్రపటాన్ని తగలబెట్టడం దేశ ఆత్మగౌరవంపై దాడి చేసినట్టేనని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగ విలువలను, బాబాసాహెబ్ ఆశయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తదితరులు ఈ ఘటనపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరో జిల్లా నాయకులు శివకుమార్, వీసీకే విద్యార్థి నాయకులు ప్రశాంత్, కార్తీక్, సాయి చరణ్, వంశీ, సంజయ్ తదితరులు, విద్యార్థులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ గారి ఆశయాల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని వీసీకే నేతలు స్పష్టం చేశారు.

# కాజీపేట ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలు





**కాజీపేట, 4 జనవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా కాజీపేట ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో, బ్రహ్మకుమారి సంస్థ వారి సహకారంతో "వేగం వద్దు ప్రాణం ముద్దు" అనే నినాదంతో "ఆటో వాలే హై దిల్ వాలే" అవగాహన కార్యక్రమాన్ని కాజీపేట టీచర్స్ కాలనీ ఫేస్‌టు ప్రాంతంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆటో డ్రైవర్లలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో విధులు నిర్వహించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. తప్పనిసరిగా యూనిఫాం ధరించి వృత్తిపరమైన నిబద్ధతను చాటాలని, ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రతే ప్రథమ లక్ష్యంగా ఆటోలు నడపాలని, నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలనే కాదు సమాజాన్నే దెబ్బతీస్తాయని హెచ్చరించారు. అలాగే ప్రతి ఆటో డ్రైవర్ తమ వాహనానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు ఆర్‌సీ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సక్రమంగా కలిగి ఉండాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా మాత్రమే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సుబేదారి బ్రహ్మకుమారి సంస్థ నిర్వాహకురాలు కల్పన మాట్లాడుతూ, ఇలాంటి అవగాహన సదస్సులు ఆటో డ్రైవర్లలో ఆత్మనియంత్రణ, మానసిక ప్రశాంతత, భద్రతాపరమైన ఆలోచన పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రోడ్డు భద్రతపై కాజీపేట ట్రాఫిక్ పోలీస్ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ అవగాహన సమావేశంలో కాజీపేట ట్రాఫిక్ ఎస్‌ఐలు శ్రావణ్ కుమార్, కనక చంద్రం పాల్గొని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతకు సంబంధించిన సూచనలు అందించారు. సుబేదారి ఏరియా పరిధిలోని మొత్తం ఎనిమిది యూనియన్లకు చెందిన 84 మంది ఆటో డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అవగాహన సదస్సు తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, ట్రాఫిక్ నిబంధనలపై స్పష్టత లభించిందని ఆటో డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని వారు కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌ను కోరారు. జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం, రోడ్డు భద్రతపై సామాన్య ప్రజల్లోనూ చైతన్యం తీసుకురావడంలో కీలకంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# మేడారంలో అవగాహన లోపంతో అసంపూర్తి పనులు.. భక్తుల ఆగ్రహం






**మేడారం, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రపంచ ప్రఖ్యాత మేడారం మహాజాతరకు ఇంకా కొంత సమయం ఉన్నప్పటికీ, అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో పూర్తికాకపోవడం భక్తుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది. జాతర సమయానికి పనులు పూర్తవుతాయా? అన్న సందేహాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. తల్లుల గద్దెల ప్రాంగణం చుట్టూ చేపట్టిన ప్రాకారం నిర్మాణం, ఆర్చ్‌ల ఏర్పాటు, గ్రానైట్ ఫ్లోరింగ్ వంటి కీలక పనులు ఇప్పటివరకు కేవలం 80 శాతం మాత్రమే పూర్తయ్యాయని అధికారిక వర్గాలు తెలిపాయి. మిగిలిన పనులు నెమ్మదిగా సాగుతుండటంతో మహాజాతరకు ముందు ఇవి పూర్తవుతాయా? అన్న ఆందోళన భక్తుల్లో నెలకొంది. ముఖ్యంగా గద్దెల ప్రాంగణంలో పనులు కొనసాగుతుండటంతో దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. మహాజాతరకు వచ్చే ప్రధాన మార్గాల్లో రోడ్ల వెడల్పు పనులు పూర్తయినప్పటికీ, సీసీ రోడ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. దీంతో ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు ప్రతిరోజూ లక్షల సంఖ్యలో మేడారానికి తరలివస్తున్న భక్తులు, పనుల కారణంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ధూళి, మట్టి, తాత్కాలికంగా వేసిన మార్గాలు భక్తులకు కష్టాలు కలిగిస్తున్నాయని వారు వాపోతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు నడవలేక ఇబ్బంది పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల మధ్య సరైన సమన్వయం లేకపోవడం, ముందస్తు ప్రణాళిక లోపించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మహాజాతర వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమానికి ముందే పనులు పూర్తి చేయాల్సి ఉండగా, ఆలస్యంగా ప్రారంభించడంతో సమస్యలు తలెత్తాయని విమర్శలు వినిపిస్తున్నాయి. భక్తుల సౌకర్యమే ప్రధాన లక్ష్యంగా అధికారులు తక్షణమే స్పందించాలని, పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పనుల వేగం పెంచడంతో పాటు, తాత్కాలికంగా అయినా భక్తులకు సురక్షితమైన మార్గాలు, సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టి, మిగిలిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తేనే రానున్న మేడారం మహాజాతర భక్తులకు సజావుగా, ప్రశాంతంగా సాగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# సర్కార్ విద్యార్థులు న్యూస్ పేపర్లు చదవాల్సిందే

### యూపీ బాటలో రాజస్థాన్.. అమలుకు ఉత్తర్వులు జారీ




**జైపూర్, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించడం, పదజాలాన్ని మెరుగుపరచడం, సమకాలీన అంశాలపై అవగాహన పెంచడం లక్ష్యంగా రాజస్థాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఉత్తరప్రదేశ్లో అమలులో ఉన్న విధానాన్ని అనుసరిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా వార్తాపత్రికలు చదవాలంటూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 31న విడుదల చేసిన ఆదేశాల ప్రకారం, ప్రతి రోజు ఉదయపు ప్రార్థనా సమావేశం (మార్నింగ్ అసెంబ్లీ) సమయంలో కనీసం 10 నిమిషాలపాటు విద్యార్థులు వార్తాపత్రికలను చదవాలి. ఈ చర్య ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరగడమే కాకుండా, దేశ, ప్రపంచ పరిణామాలపై అవగాహన పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి ప్రభుత్వ సీనియర్ సెకండరీ, ఇంగ్లిష్ మీడియం పాఠశాల తప్పనిసరిగా రెండు వార్తాపత్రికలను తెప్పించుకోవాలి. వాటిలో ఒకటి హిందీ, మరొకటి ఇంగ్లిష్ పత్రికగా ఉండాలని స్పష్టం చేసింది. అలాగే అప్పర్ ప్రైమరీ పాఠశాలలు కనీసం రెండు హిందీ వార్తాపత్రికలు తప్పనిసరిగా తెప్పించుకోవాలని ఆదేశించింది. ఈ వార్తాపత్రికల కొనుగోలుకు అయ్యే ఖర్చును రాజస్థాన్ విద్యా మండలే భరిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ నిర్ణయం వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెరగడంతో పాటు, భాషా నైపుణ్యాలు మెరుగుపడతాయని, జనరల్ నాలెడ్జ్‌తో పాటు సమకాలీన అంశాలపై అవగాహన పెరుగుతుందని విద్యాశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అలాగే విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచనా శక్తి కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, మొబైల్, సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత కాలంలో విద్యార్థులను మళ్లీ పుస్తకాలు, వార్తాపత్రికల వైపు మళ్లించే ప్రయత్నం ప్రశంసనీయమని వ్యాఖ్యానిస్తున్నారు. రాజస్థాన్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలవనుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# సౌత్ జోన్ ఈస్ట్ ఇంటర్‌యూనివర్సిటీ ఫుట్‌బాల్ టోర్నీకి కేయూ జట్టు ఎంపిక



**హన్మకొండ, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్) :**

కాకతీయ యూనివర్సిటీ (కేయూ) పురుషుల ఫుట్‌బాల్ జట్టు, 202526 సంవత్సరానికి నిర్వహించనున్న సౌత్ జోన్ ఈస్ట్ ఇంటర్‌యూనివర్సిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైంది. ఈ టోర్నమెంట్‌ను వోక్సెన్ యూనివర్సిటీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో జనవరి 5 నుంచి జనవరి 11, 2026 వరకు నిర్వహించనున్నారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ వై. వెంకయ్య విడుదల చేసిన ప్రకటనలో, వివిధ కళాశాలలకు చెందిన 22 మంది విద్యార్థులు కాకతీయ యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, జంగావ్ ప్రాంతాల కళాశాలల నుంచి ఎంపికైన క్రీడాకారులు జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ ఫుట్‌బాల్ జట్టుకు డా. ఏటిబిటి ప్రసాద్ (ఫిజికల్ డైరెక్టర్, యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్, హనుమకొండ) కోచ్‌గా, పి. బాలశౌరయ్య (ఫిజికల్ డైరెక్టర్, విద్యావోతి డిగ్రీ కాలేజ్, ఘనపూర్) మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. వీరు జట్టుతో పాటు టోర్నమెంట్‌కు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులు, క్రీడాకారులను అభినందిస్తూ, జట్టు సత్తా చాటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులు తమ ప్రతిభతో యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని స్పోర్ట్స్ బోర్డు ఆకాంక్షించింది.

## డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ ఇప్పిస్తానని రూ.లక్ష మోసం బాధితురాలి ఫిర్యాదు

**భద్రాద్రి కొత్తగూడెం,4 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**




భద్రాచలం పట్టణానికి చెందిన ముత్యాల లలిత కుమారికి డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ ఇప్పిస్తానని చెప్పి రూ. 1 లక్ష నగదు తీసుకుని ఫ్లాట్ ఇప్పించకుండా మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరుతూ బాధితురాలు బి అండ్ జి హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ కమిటీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అసోసియేషన్ నేషనల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రావులపల్లి తిరుపతయ్య మాట్లాడుతూ, బాధితురాలి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మోసానికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా ముందుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా వింగ్ చైర్మన్ ప్రియా శెట్టి, ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ పూస శ్రీనుతో పాటు సుభద్ర, అనిత పాల్గొన్నారు. బాధితుల ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకుని, ఇలాంటి మోసాలపై కఠిన చర్యలు అవసరమని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు.

# శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న నాంపల్లి సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ జడ్జి డా. పట్టాభిరామారావు





## ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత

**వరంగల్, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంను ఆదివారం సాయంకాలం హైదరాబాదు నాంపల్లి సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ జడ్జి డా. పట్టాభిరామారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి సన్నిధికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రవేశ ద్వారంలో పూర్ణకుంభం, మంగళవాద్యాలతో స్వాగతం పలికిన అనంతరం డా. పట్టాభిరామారావును అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహింపజేసి, కుటుంబ సభ్యులతో కలిసి శాంతి, సమృద్ధి, ప్రజా క్షేమం కోసం ప్రార్థనలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలను న్యాయమూర్తికి బహూకరించి, మహాదాశీర్వచనం నిర్వహించారు. ప్రత్యేక ప్రసాదాలు అందజేయగా, ఆలయ వాతావరణం భక్తి పరవశంతో నిండిపోయింది. న్యాయమూర్తి ఆలయ నిర్వహణ, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో హనుమకొండ సీనియర్ సివిల్ జడ్జి, దేవాలయ ధర్మకర్త, ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. భద్రకాళీ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు కూడా ఈ సందర్భంగా న్యాయమూర్తిని దర్శించుకుని శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ నగరానికి ఆధ్యాత్మిక కేంద్రమైన భద్రకాళీ దేవస్థానంలో ప్రముఖులు ఈ విధంగా దర్శించుకోవడం భక్తుల్లో మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

# ఇంద్ర సినిమాలో బ్రహ్మానందం సీన్ రిపీట్ చేసిన దొంగ బాబాలు

**హన్మకొండ, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్) :**

ఇంద్ర సినిమాలో బ్రహ్మానందం చేసిన హాస్య సీన్‌ను తలపించేలా, దొంగబాబాలు నిజ జీవితంలో ఘోర మోసానికి పాల్పడ్డారు. బ్యాగులో పెట్టిన డబ్బులకు పూజలు చేస్తే మూడింతలు అవుతాయని నమ్మించి, ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ.55.55 లక్షలు కొల్లగొట్టిన ఘటన హనుమకొండ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉనికిచెర్ల శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం, బాధితుడిని లక్ష్యంగా చేసుకున్న దొంగబాబాలు తమను ఆధ్యాత్మిక శక్తులు కలిగిన వారిగా పరిచయం చేసుకున్నారు. డబ్బులకు ప్రత్యేక పూజలు చేస్తే అవి మూడు రెట్లు అవుతాయని, అదృష్టం కలిసి వస్తుందని నమ్మించారు. వారి మాటలను నమ్మిన బాధితుడు దశలవారీగా మొత్తం రూ.55.55 లక్షలను వారికి అప్పగించినట్లు సమాచారం. కొంతకాలం గడిచినా డబ్బులు తిరిగి రాకపోవడంతో పాటు, దొంగబాబాలు కనిపించకుండా పోవడంతో బాధితుడికి మోసం జరిగిందని అర్థమైంది. దీంతో పోలీసులను ఆశ్రయించగా, విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. ఇలాంటి దొంగబాబాల మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సులభంగా డబ్బులు పెరుగుతాయన్న నమ్మకాలతో మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటన మరోసారి మూఢనమ్మకాలు ఎంత ప్రమాదకరమో చూపిస్తోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా 'స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ' ప్రారంభం



**హన్మకొండ, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్) :**

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ హనుమకొండ జిల్లాలో అధికారికంగా ప్రారంభమైంది. ఈనాగరేషన్ కార్యక్రమం నడికూడ మండలం పరిధిలోని పోచంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాలోని 14 మండలాల పరిధిలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని అందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నడికూడ మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలకు సుమారు రూ.15,000 విలువైన సౌండ్ సిస్టమ్‌ను ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ సౌండ్ సిస్టమ్‌ను హనుమకొండ రిటైర్డ్ జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ రెడ్డి, స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు, రిటైర్డ్ పీజీ హెచ్‌ఎం రాధా, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి. ఉప్పలయ్య చేతుల మీదుగా పాఠశాలకి అందజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని వక్తలు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేసినందుకు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధా మేడంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

# మా పునాది వల్లే ఈ మైలురాయి

**భోగాపురం ఎయిర్ పోర్టుపై జగన్ ట్వీట్**
**భోగాపురం విమానాశ్రయంలో తొలి విమానం ల్యాండింగ్‌పై స్పందించిన జగన్**
**ఇది ఏపీ అభివృద్ధిలో ఒక మైలురాయి అని వ్యాఖ్య**
**మా హయాంలోనే భూసేకరణకు రూ. 960 కోట్లు ఖర్చు చేశామని వెల్లడి**
**వేగవంతమైన అనుమతులతో పనులకు బలమైన పునాది వేశామంటూ ట్వీట్**

**విశాఖపట్నం, జై భీమ్ న్యూస్**

విశాఖపట్నంలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి విమానం ల్యాండ్ అవ్వడంపై వైసీపీ అధినేత జగన్ స్పందించారు. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ఒక మైలురాయి అని, విజన్ వైజాగ్ లక్ష్య సాధన దిశగా పడిన కీలక అడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుత దశకు చేరుకోవడానికి తమ ప్రభుత్వ హయాంలో వేసిన బలమైన పునాదే కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ స్పందిస్తూ, "మా పాలనా కాలంలో ఈ ప్రాజెక్టుకు వేగవంతమైన అనుమతులు సాధించాం. భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం కోసం సుమారు రూ. 960 కోట్లు ఖర్చు చేయడం ద్వారా ప్రాజెక్టుకు పటిష్ఠమైన పునాది వేశాం. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన పనుల్లో గణనీయమైన భాగం అప్పుడే పూర్తయింది. ఆ రోజు మేం చేసిన కృషే ఇవాళ్టి ఈ కీలక మైలురాయిని చేరుకోవడానికి ముఖ్య కారణం" అని వివరించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో అసాధారణ కృషి చేసిన జీఎంఆర్ గ్రూప్‌కు జగన్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అదేవిధంగా, విశాఖపట్నం పోర్టును భోగాపురం విమానాశ్రయంతో అనుసంధానించే బైపాస్ జాతీయ రహదారి ప్రాజెక్టుకు 2023 మార్చిలో ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# సైకాలజిస్టుల అధ్యక్ష ఎన్నిక, డైరీ ఆవిష్కరణ

**సైకాలజిస్టులో సమాజానికి మేలు చేస్తున్నారు**
**మానసిక పరిజ్ఞానానికి రూపకర్తలు**
**సమాజంలోని మానసిక సమస్యలను భరిస్తున్నారు**
**అనుభవం కలిగిన సైంటిస్టులతో సమానులు సైకాలజిస్టులు**




**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

నూతన సంవత్సరం సందర్భంగా డైరీ ఆవిష్కరణ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం హన్మకొండ కలెక్టరేట్ సమీపంలోని కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ సైకాలజీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రామచందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు వారి ఆధ్వర్యంలో కార్యవర్గం ఎన్నికలు డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు శ్రీవిద్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది జనరల్ సెక్రటరీగా విక్రమ్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివుడు జాయింట్ సెక్రెటరీగా కళ్యాణి కోశాధికారిగా, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మురళీధర్ సభ్యులు శ్రీలత, జగన్మోహన్, దీపిక, అడ్వకేట్ దయాకర్ , తదితర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీవిద్య మాట్లాడుతూ నేటి సమాజంలో యువతకి మానసిక సమస్యలపై ప్రథమ చికిత్సల కౌన్సిలింగ్ ఉపయోగపడుతుంది నూతన ఆవిష్కారాలు కృత్రిమ మేధ (ఏఐ) నేటి యువత ఎన్నో రకాలైన మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారని సమస్య నుండి బయటపడాలంటే సైకాలజిస్టులో సేవలు ఉపయోగించుకోవాలని ప్రజలలో అవగాహన తప్పక పెరగాలని తెలిపారు ఒత్తిళ్ళ మధ్య ప్రజలు సతమతమవుతున్నారని తట్టుకోలేక అర్ధాంతరంగా జీవితాన్ని ముగుస్తున్నారని ఎన్నో రకాల మానసిక సమస్యలతో సరైన నిర్ణయాలు తీసుకోలేకుండా విపరీతమైన నిర్ణయాలతో జీవితం అంతం చేసుకుంటున్నారని వివరించారు కొత్తగా సెంట్రల్ గవర్నమెంట్ వివాహానికి ముందు కౌన్సిలింగ్ ( ప్రీ మ్యారిటల్ కౌన్సెలింగ్)అనే పద్ధతిని మున్ముందు తీసుకురాబోతుందని కౌన్సిలర్ నియమించే ప్రక్రియ చేపట్టి సాధారణ ప్రజలకు కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉంచాలని ప్రస్తావించావు మానసిక ఆరోగ్యమే ఆరోగ్యకరమైన జీవితానికి నాంది అని తెలపడం జరిగింది. సైకాలజిస్టుల మేదో మదన సమావేశం జరిగింది. ద

# భోగాపురం కల సాకారం.. ల్యాండైన తొలి విమానంవిజయవంతంగా పూర్తయిన వ్యాలిడేషన్ (టెస్ట్)

**ఫ్లైట్‌విమానంలో ప్రయాణించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**
**96 శాతానికి పైగా పూర్తయిన ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు**
**జూన్ 26న విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు**

**విజయనగరం, జై భీమ్ న్యూస్**

విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి విమానం విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. ఇవాళ ఉదయం 10.15 గంటల సమయంలో ఢిల్లీ నుంచి వచ్చిన వ్యాలిడేషన్ (టెస్ట్) ఫ్లైట్ ఇక్కడి రన్‌వేపై దిగింది. ఈ విమానంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఏటీసీ ఛైర్మన్ తదితరులు ప్రయాణించారు. అత్యాధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు పనులు ఇప్పటికే 96 శాతం పూర్తయినట్లు నిర్మాణ సంస్థ జీఎంఆర్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో విమానాశ్రయాన్ని జూన్ 26న అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు వేగవంతం చేశారు. ఈ టెస్ట్ ఫ్లైట్ విజయవంతం కావడంతో త్వరలోనే ఈ ప్రాంతం నుంచి విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.

# సంక్రాంతి సందర్భంగా నగరవాసులకు సీపీ సజ్జనార్ కీలక సూచనలు



**హైదరాబాద్, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్) :**

సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లే నగరవాసులు భద్రతాపరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సజ్జనార్ సూచించారు. పండుగల సమయంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో దొంగతనాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. స్వస్థలాలకు వెళ్లే ముందు తమ సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా బీట్ ఆఫీసర్‌కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంట్లో నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను ఉంచవద్దని, వాటిని బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని స్పష్టం చేశారు. ఇక ఇళ్లకు తాళాలు వేసే సమయంలో తలుపులు, కిటికీలు సక్రమంగా లాక్ చేశామా లేదా మరోసారి పరిశీలించుకోవాలని, పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలని, హైదరాబాద్ పోలీసులు 24 గంటలూ ప్రజల భద్రత కోసం అప్రమత్తంగా ఉంటారని సీపీ సజ్జనార్ తెలిపారు. పండుగను ఆనందంగా, భద్రంగా జరుపుకోవడానికి పోలీసుల సూచనలను పాటించాలని ఆయన నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

# మేడారంలో తొలి బాంబో చికెన్ షాప్ ప్రారంభం



**ములుగు జిల్లా, మేడారం, 4 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రపంచ ప్రఖ్యాత మేడారం జాతర సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొలి బాంబో చికెన్ షాప్ ను జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరియు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మేడారం జంపన్న వాగు సమీపంలో శనివారం ప్రారంభించారు. మేడారం జాతరలో తొలిసారిగా ఆరోగ్యకరమైన విధానంలో, నాణ్యమైన నూనె వినియోగం లేకుండా తయారు చేసే బాంబో చికెన్ స్టాల్‌ను ఏర్పాటు చేయడం విశేషమని అధికారులు తెలిపారు. మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు భక్తులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ బాంబో చికెన్ షాప్‌ను కే. సంధ్య, బి. రజితలు సరస్వతి స్వయం సహాయక సంఘం (వీఓ – శ్రీ ఆంజనేయ), మేడారం గ్రామానికి చెందిన సభ్యులు ఏర్పాటు చేశారు. మేడారం పరిధిలో ఇలాంటి మరిన్ని 10 బాంబో చికెన్ షాపులు త్వరలో ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది మేడారం జాతరలో మొత్తం 485 షాపులు, అలాగే జాతర మార్గంలో 84 దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ శ్రీనివాస్ రావు, అదనపు డి.ఆర్.డి.ఓ శ్రీనివాస్ గౌెట్టె, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలతో పాటు మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబనను పెంపొందించడంతో పాటు భక్తులకు ఆరోగ్యకరమైన ఆహార ఎంపికలను అందించే దిశగా ఈ ప్రయత్నం ఆదర్శంగా నిలుస్తుందని మంత్రులు పేర్కొన్నారు.

# సర్పంచులు సేవాభావంతో రాణించాలి!

**మేయర్ గుండు సుధారాణి**


**వరంగల్, 4 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన పద్మశాలి ప్రజా ప్రతినిధులు కక్షలుకార్పణ్యాలకు తావివ్వకుండా సేవాభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని లిలిగ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. పద్మశాలి జర్నలిస్టుల అసోసియేషన్, పద్మశాలి డాక్టర్స్ అసోసియేషన్, పద్మశాలి విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు నిర్వహించిన 'విక్టరీస్ ఫెలిసిటేషన్' కార్యక్రమం హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పద్మశాలి జర్నలిస్టుల అసోసియేషన్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట మాజీ శాసన సభ్యులు వన్నాల శ్రీరాములు హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, అఖిల భారత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి నరేందర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ పదవి అత్యంత కీలకమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పెద్దపీట వేస్తుందని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఫైనాన్స్ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రాధాన్యత పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు మీపై ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మంచి ప్రజా ప్రతినిధులుగా గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యేల సహకారం తీసుకోవడంలో ఎలాంటి మొహమాటం అవసరం లేదని స్పష్టం చేశారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ, రాజకీయాల్లో గుండె ధైర్యం, నిబ్బరం అత్యవసరం అన్నారు. పద్మశాలీలు చట్టసభల్లో ప్రాతినిధ్యం పొందాలంటే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులే కీలక భూమిక పోషించాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ఎదురయ్యే రాజకీయ సమీకరణలను ధైర్యంగా ఎదుర్కొంటే ప్రజల ఆదరణ లభిస్తుందని అన్నారు.వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు మాట్లాడుతూ, పద్మశాలీలు ఒకరిపై ఒకరు పోటీ పడి నష్టపోయిన సందర్భాలు పునరావృతం కాకుండా ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్ పద్మశాలీలు ఎదిగినకొద్దీ ఒదిగి ఉండి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని కోరారు. అఖిల భారత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్ మాట్లాడుతూ, రాజకీయాల్లో పార్టీలు వేరు అయినా కుల ఐక్యత విషయంలో అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈద్ వెంకటేశ్వర్లు గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు పూర్తి అండదండలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, మెండు రవిందర్, వల్లాల వెంకట రమణ, పద్మశాలి డాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్, పద్మశాలి విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, పోస్టల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొద్దుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పద్మశాలి జర్నలిస్టుల అసోసియేషన్ కోశాధికారి, తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వేముల సదానందం స్వాగతోపన్యాసం చేశారు.

# వరంగల్ బట్టల బజార్‌లో నకిలీ బ్రాండ్ల కలకలంఢిల్లీ పోలీసుల తనిఖీల్లో భారీగా డూప్లికేట్ వస్త్రాల పట్టివేత



**వరంగల్ జిల్లా, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని ప్రముఖ బట్టల బజార్‌లో నకిలీ బ్రాండ్ల వ్యాపారం బయటపడడంతో వ్యాపార వర్గాల్లోనే కాకుండా ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. హోల్‌సేల్ బట్టల దుకాణాల పేరుతో పేరెన్నికగన్న పెద్ద బ్రాండ్లను అనుకరిస్తూ డూప్లికేట్ వస్త్రాలను విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో అధికార యంత్రాంగం విస్తృత తనిఖీలు చేపట్టింది. పోలీసుల సమాచారం ప్రకారం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఒక వర్గం వ్యాపారస్తులు ఒరిజినల్ కంపెనీల పేర్లు, లోగోలు, బ్రాండ్ ట్యాగ్‌లను ఉపయోగిస్తూ నకిలీ బట్టలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంతో తమ బ్రాండ్ విలువకు తీవ్ర నష్టం జరుగుతోందని భావించిన ఒరిజినల్ కంపెనీల యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీస్ ప్రత్యేక బృందం, సంబంధిత అడ్వకేట్లతో కలిసి వరంగల్ పోలీస్ సంయుక్తంగా వరంగల్ బట్టల బజార్‌లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పలు దుకాణాలు, గోదాములను తనిఖీ చేసి పెద్ద ఎత్తున డూప్లికేట్ బ్రాండెడ్ వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వస్త్రాలు ప్రముఖ వర్జినల్ కంపెనీల పేర్లతో విక్రయానికి సిద్ధంగా ఉంచినవిగా పోలీసులు గుర్తించారు. వీటి విలువ లక్షల్లో ఉండవచ్చని ప్రాథమిక అంచనా. నకిలీ బ్రాండ్లతో వినియోగదారులను మోసం చేస్తున్న వ్యాపారులపై కాపీరైట్, ట్రేడ్‌మార్క్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకునే దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ ఘటనతో వరంగల్ బట్టల వ్యాపార రంగంలో ఒక్కసారిగా కలకలం రేగింది. అసలైన వ్యాపారులు తమకు ఎలాంటి సంబంధం లేదని చెబుతూ, నకిలీ వ్యాపారుల వల్ల నిజాయితీగా వ్యాపారం చేసే వారికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ, నకిలీ బ్రాండ్ల విక్రయాలపై భవిష్యత్తులోనూ నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై ఎలాంటి సడలింపు ఉండదని స్పష్టం చేశారు. అదే సమయంలో వినియోగదారులు కూడా బ్రాండెడ్ వస్త్రాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు, అసలైన ట్యాగ్‌లు, ధర వివరాలు పరిశీలించి జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

# హరీశ్ రావును మరోసారి టార్గెట్ చేసిన కవిత

**మాజీ మంత్రి హరీశ్ రావుపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు**

**ఒక్క మాటకే అసెంబ్లీని బహిష్కరించడం సరికాదని వ్యాఖ్య**

**హరీశ్ పార్టీలో సొంతంగా గ్రూపు తయారు చేస్తున్నారని ఆరోపణకృష్ణా జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని విమర్శ**

**కర్ణాటక ప్రాజెక్టులపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సూర్యాపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయంపై హరీశ్ రావును లక్ష్యంగా చేసుకున్నారు. వ్యక్తిగతంగా హరీశ్ రావును ఒక మాట అన్నందుకే అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తారా అని కవిత ప్రశ్నించారు. "ఆ అంశంపై వాకౌట్ చేసి, మళ్లీ సభకు రావొచ్చు కదా? బీఆర్ఎస్‌లో హరీశ్ ఓ గ్రూపును తయారు చేస్తున్నారు. బయట సభలు పెడుతూ చట్టసభల్లో మాట్లాడే అవకాశాన్ని వదులుకోవడం సరైంది కాదు" అని ఆమె వ్యాఖ్యానించారు. హరీశ్ ధనదాహం కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి ప్రాజెక్టును మార్చారని, ఆయన నిర్ణయాలతో సాగునీటి ప్రాజెక్టులకు తీవ్ర నష్టం జరిగిందని ఆరోపించారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత విమర్శలు చేశారు. ప్రతిపక్షం లేని సభలో కృష్ణా జలాలపై ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందన్నారు. గత ప్రభుత్వాన్ని నిందించడంపై ఉన్న శ్రద్ధ, కృష్ణా నీటి వాటాలపై చర్చ జరపడంలో లేదని విమర్శించారు. తెలంగాణకు చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక చేపడుతున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదాను రద్దు చేయాలని, ఆల్మట్టి డ్యాం ఎత్తు తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని కవిత డిమాండ్ చేశారు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నా నీటి సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ఆమె ప్రశ్నించారు.



# పార్ట్ టైం కాదు పూర్తి సమయ సేవలు: పి.టి.ఐలకు మినిమం బేసిక్‌పే ఇవ్వాలి





**వరంగల్, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

పార్ట్ టైం అనే పేరుతో సంవత్సరాలుగా పూర్తి సమయ విధులు నిర్వర్తిస్తున్న ఆర్ట్, ఫిజికల్ అండ్ వర్క్ ఎడ్యుకేషన్ టీచర్లకు వెంటనే మినిమం బేసిక్ పే చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని తెలంగాణ ఆర్ట్, ఫిజికల్ అండ్ వర్క్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కమలాకర్ రావు డిమాండ్ చేశారు. నేడు వరంగల్ నగరంలోని మట్టేవాడలో నిర్వహించిన పార్ట్ టైం బోధకుల సంఘ నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, గత 13 సంవత్సరాలుగా ప్రభుత్వ, జిల్లా పరిషత్త పాఠశాలల్లో పార్ట్ టైం పేరుతో ఫుల్ టైం విధులు నిర్వహిస్తున్నప్పటికీ, చాలీచాలని వేతనాలతోనే పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్వల్ వర్క్ ఈక్వల్ పే సూత్రాన్ని అమలు చేస్తూ, విద్యాశాఖలో వీరితో సమాన విధులు నిర్వహిస్తున్న ఆర్ట్ క్రాఫ్ట్ టీచర్లకు వర్తించే మినిమం బేసిక్ పేను పార్ట్ టైం ఆర్ట్, ఫిజికల్, వర్క్ ఎడ్యుకేషన్ టీచర్లకూ వెంటనే వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ డిమాండ్ సాధన కోసం భవిష్యత్ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే సమావేశంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయురాళ్లు అనిత, పావని, కరుణ కుమారి, రమాదేవి, రమణిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి.టి.ఐ సంఘ నాయకులు రమేష్, హరిగోపాల్, వనమాచారి, బిక్షపతితో పాటు ఇతర సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# కొత్తూరులో ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభంఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభం





**వరంగల్, 4 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 5వ డివిజన్ కొత్తూరు ట్రాన్స్ఫార్మర్ ప్రాంతంలో శివాజీ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రక్తపోటు, మధుమేహం (చక్కెర) పరీక్షలు, గుండె సంబంధిత వైద్య పరీక్షలతో పాటు సాధారణ ఆరోగ్య పరీక్షలను నిపుణులైన వైద్యులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు హాజరై ఈ సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని, ముందస్తు వైద్య పరీక్షల ద్వారా అనారోగ్యాలను నివారించవచ్చని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు సేవా కార్యక్రమాలు చేపడుతున్న శివాజీ గ్రూప్‌ను ఆయన అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, జక్కుల రవీందర్, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, అజీజ్ ఉల్లా బేగ్, 6వ డివిజన్ అధ్యక్షులు శివాజీ, నాయకులు గణేష్, అనిల్తో పాటు వైద్యులు, శిబిర నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE


## నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?



ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్సిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణులు.

## పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?

పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్ఫరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %డ% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.




# ఈ నీరు అమృతంతో సమానం!

ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలి వల్ల శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాటిలో ముఖ్యంతో వయసుతో సంబంధం లేకుండా వచ్చే స్థూలకాయం ఒకటి. ఊబకాయాన్ని తగ్గించుకోవడానికి మంచి ఆహారం, వ్యాయామమే మార్గం. అంతేకాకుండా కొన్ని ఇంటి చిట్కాలను పాటించడం వల్ల బరువు తగ్గొచ్చని మన పెద్దలు చెబుతున్నారు. బరువు తగ్గడానికి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగితే.. నిమ్మ, తేనె: ఒక గ్లాసు నీటిలో సగం నిమ్మకాయ, ఒక చెంచా తేనె, చిటికెడు ఎండుమిర్చి వేసి తినాలి. నల్ల మిరియాలలో పైపెరిన్ అనే మూలకం ఉంటుంది. ఇది శరీరంలో కొత్త కొవ్వు కణాలు పేరుకుపోవడానికి అనుమతించదు. నిమ్మకాయలో ఉండే ఆస్కార్బిక్ యాసిడ్ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. శరీరం నుండి విషపూరిత మూలకాలను తొలగించడంలో సహాయపడుతుంది. సోంపు నీరు: 6-8 సోంపు గింజలను ఒక కప్పు నీటిలో ఐదు నిమిషాలు మరిగించాలి. దీన్ని వడపోసి ఉదయం ఖాళీ కడుపుతో వేడి వేడిగా తాగాలి. ఇది అధిక ఆకలి సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాకుండా తినాలనే కోరికను తగ్గిస్తుంది. ఇది శరీరంలోని మురికిని శుభ్రపరుస్తుంది. మూత్రవిసర్జన, చెమట అధికంగా వచ్చేలా ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీరు: జీలకర్ర నీటిని తాగడం వల్ల స్థూలకాయం త్వరగా తగ్గుతుంది. ఇందులో క్యుమినాల్డిహైడ్, థైమోక్వినోన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. ఆర్థరైటిస్ , కీళ్ల నొప్పులు వంటి పరిస్థితులు ఉంటే, చికాకు, వాపును తగ్గించడంలో జీలకర్ర నీరు ప్రభావవంతంగా ఉంటుంది. మెంతి గింజల నీరు: మెంతి నీరు తాగడం వల్ల స్థూలకాయం తగ్గడమే కాకుండా మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో మెంతులు సహకరిస్తాయి. మెంతి నీటిని తయారు చేయడానికి, ముందుగా 1 టీస్పూన్ మెంతి గింజలను 1 గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. దీని తరువాత, ఉదయం నిద్రలేచిన తర్వాత, ఈ నీటిని వడపోసి ఖాళీ కడుపుతో తాగాలి.



## గుండెపోటుకు గురికాకూడదనుకునే వారు వీటిని అలవాటు చేసుకోవాల్సిందే

ప్రస్తుత రోజుల్లో గుండెపోటు అనేది సర్వసాధారణమైపోయింది. ఇంతకుముందు ఈ సమస్య పెద్దవారిలో మాత్రమే కనిపించేది. కానీ, ఇప్పుడు యువత కూడా దీని బారిన పడుతున్నారు. ఎవరైనా డ్యాన్స్ చేస్తున్నప్పుడు, లేదా ఏదైనా పనిచేస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా పడిపోయారని మీరు తరచుగా వినే ఉంటారు. అలాంటి వారు కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణిస్తారు. వీటన్నింటికీ ప్రధాన కారణం ధమనులలో ఫలకం అడ్డుపడటం. దీని కారణంగా రక్తం గుండెకు చేరదు. శరీరంలో ఆక్సిజన్ కొరత ఉంటుంది. ఈ పరిస్థితిలో గుండెపోటు లేదా గుండె ఆగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ఈ పరిస్థితులన్నింటినీ నివారించడానికి, మీ జీవనశైలిలో కొన్ని మార్పులు అవసరం. అందుకోసం ఈ అలవాట్లను అలవాటు చేసుకోండి. కొలెస్ట్రాల్ లేదా ఫలకం ధమనులను అడ్డుకోవడం వల్ల గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగడానికి అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన ఆహారం. ఈ పరిస్థితిలో, మీరు గుండె సంబంధిత సమస్యలను నివారించాలనుకుంటే ఈ రోజు నుండి అనారోగ్యకరమైన ఆహారం లేదా ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాన్ని తినడం మానేయండి. వాటికి బదులుగా పచ్చి ఆకు కూరలు, పప్పులు, తృణధాన్యాలు, తాజా పండ్లు, గుడ్లు వంటి తాజా ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినండి. ధమనులలో ఫలకం పేరుకుపోకుండా నిరోధించడానికి, మీరు రోజూ వ్యాయామం చేయడం ముఖ్యం. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలి. దీని కోసం ప్రతిరోజూ సైకిల్, ఈత, పరుగు, నడక, శక్తి శిక్షణ చేయండి. ధూమపానం ఊపిరితిత్తులకు మాత్రమే హాని చేస్తుందని అనుకుంటే అది తప్పు. అది గుండెకు కూడా హాని చేస్తుంది. సిగరెట్ పొగ నుండి విడుదలయ్యే రసాయనాలు ధమనులలో పొరను ఏర్పరుస్తాయి. దీని వలన ధమనులు నిరోధించబడతాయి. ఈ రోజుల్లో, ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారుతోంది. ఇది ధమనులలో వాపును కలిగిస్తుంది. దీని వలన ధమనులు ఉబ్బడం అలాగే నిరోధించబడతాయి. ఒత్తిడి కారణంగా శరీరంలో 1500 రసాయనాలు విడుదలవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈ పరిస్థితిలో, ఒత్తిడిని నియంత్రించడానికి ప్రశాంతంగా ఉండండి. కోపం తెచ్చుకోకండి. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయండి. మీరు మీ హృదయాన్ని ప్రేమిస్తే మద్యానికి దూరంగా ఉండండి. ఆల్కహాల్ కొలెస్ట్రాల్, రక్తపోటు రెండింటినీ పెంచుతుంది. కాబట్టి, గుండె ఆరోగ్యంగా ఉండటానికి దాని వినియోగాన్ని నివారించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి. అధిక బరువు కొలెస్ట్రాల్, అధిక రక్తం, అధిక షుగర్‌కి అతి పెద్ద కారణంగా పరిగణించబడుతుంది. కాబట్టి దానిని అదుపులో ఉంచండి. దీని కోసం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.




## అలాంటివారు ఈ పండు తినకండి!

జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి. అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.



## పడుకునే ముందు వాము నీటిని తాగితే ఇన్ని లాభాలా?



వామును మెత్తటి పౌడర్‌గా చేసుకుని నిల్వ చేసుకోవాలి. పంటి నొప్పితో ఇబ్బంది పడుతున్నవారు.. అర టీ స్పూన్ వాము పౌడర్, కొద్దిగా ఆలివ్ ఆయిల్, గోరువెచ్చని నీటితో కలిపి తాగితే, పంటి నొప్పిని తగ్గిస్తుంది. అంతేకాదు..నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. గోరువెచ్చని నీటిలో వాము పౌడర్ కలిపి తాగడం వల్ల నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే తిమ్మిర్లు, కడుపు నొప్పిని దూరం చేస్తుంది. పొత్తి కడుపు తగ్గుతుంది. ఇలా క్రమంగా వాము వాటర్ తాగుతూ ఉంటే.. బరువు కూడా తగ్గుతారు. ఇందుకోసం వాము పొడి లేదంటే, వాముని నేరుగా కూడా తీసుకోవచ్చు. వాములో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల శ్వాస కోస వ్యాధులు రాకుండా ఉంటాయి. ఒక వేళ జలుబు, దగ్గు, కఫం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నీటిని తాగడం వల్ల అవి తగ్గుముఖం పడతాయి. రాత్రి పడుకునే ముందు ఇలా గోరువెచ్చని నీటిలో వాము పౌడర్‌ని కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. సాధారణంగా కడుపు ఉబ్బరం, త్రేన్పులు, జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో ఈ వాము వాటర్ బాగా హెల్ప్ చేస్తాయి. వాముని కప్పున్నర నీటిలో వేసి మరిగించి కప్పు అయ్యే వరకూ ఉంచాలి. దీనిని ఫిల్టర్ చేసి రెగ్యులర్‌గా తీసుకుంటే బరువు తగ్గుతారు. పిల్లలకు అరుగుదల సరిగ్గా లేకపోయినా, పెద్దలు గ్యాస్ లాంటి వాటితో బాధ పడుతున్నా వాము ఔషధంగా పనిచేస్తుంది. వాముతో జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM